ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

నారాయణపేట
జిల్లా వార్తలు
ఆదివారం 18 మే 2025
ఉష్ణోగ్రతలు | గరిష్టం : 36.0 | కనిష్టం : 25.0

పూర్వ వైభవం వచ్చేనా?

- కొన్నేళ్లుగా నిరాదరణకు గురవుతున్న పిల్లలమర్రి
- మిస్ వరల్డ్ పోటీదారుల రాకతో అందరి దృష్టి ఆకర్షించిన పర్యాటక ప్రాంతం
- ప్రపంచఖ్యాతి పొందిన క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేయాలి
- సుందరీమణుల రాకతో పెరిగిన సందర్శకులు



పిల్లలమర్రి వద్ద శుక్రవారం ఫొటోకు ఫోజిచ్చిన మిస్ వరల్డ్ పోటీల సుందరీమణులు



పిల్లల మర్రి వద్ద సందర్శకులు, సెల్ఫీ దిగుతున్న సందర్శకులు

మహబూబ్‌నగర్ మే 17(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ అంటే అందరికి గుర్తుకు వచ్చేది పిల్లలమర్రి. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ క్షేత్రం ఒకప్పుడు సందర్శకులతో కిటకిటలాడేది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను పిక్‌నిక్‌ల పేరిట ఇక్కడికి తీసుకొచ్చే వారు. మహా వృక్షం చరిత్రను చిన్నారులకు వివరించేవారు. ఎప్పుడూ పర్యాటకులతో ఈ ప్రాంతం సందడిగా కనిపించేది. కానీ కొన్నేళ్లుగా ఈ క్షేత్రం నిరాదరణకు గురైందన్నది బహిరంగ రహస్యమే. ఇక్కడ సరైన వసతులు లేకపోవడం, పర్యాటకులను ఆకర్షించే కార్యక్రమాలు నిర్వహించకపోవడంతో పర్యాటకుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. మహావృక్షం రెండు భారీ ఊడలు నేలకు ఒరగడంతో ఇక పిల్లలమర్రి చరిత్ర గతమేనని అంతా భావించారు. అయితే అదృష్టవశాత్తు అధికార యంత్రాంగం చేసిన ప్రయత్నాలు ఫలించాయి. సెలైన్ ట్రీట్‌మెంట్‌తో ఊడలు మళ్లీ పునరుజ్జీవం పోసుకోవడంతో పాటు కొత్త ఊడలు రావడంతో మహావృక్షం మళ్లీ ఠీవీగా నిలబడింది.

సుందరీమణుల రాకతో..

తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో ప్రపంచ సుందరీమణుల పోటీలు నిర్వహిస్తోంది. అందులో పాల్గొనడానికి వచ్చిన వివిధ దేశాల 22 మంది అందమైన భామలు శుక్రవారం పిల్లలమర్రిని సందర్శించడంతో మహావృక్షం ఖ్యాతి ప్రపంచ వ్యాపితం అయ్యింది. పర్యాటక క్షేత్రాలకు గుర్తింపు తేవడానికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నంతో భాగంగా వారు పిల్లలమర్రిని చూడటానికి వచ్చారు. ఈ చెట్టును చూసి అబ్బురపడ్డారు. 800 ఏళ్ల దాని చరిత్రను తెలుసుకుని ఫిదా అయ్యారు. సుందరీమణుల రాక సందర్భంగా వారం పది రోజులుగా అక్కడ అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. రంగులు వేయడం, గ్రీనరీని ఏర్పాటు చేయడం, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. అందగత్తెలను ఆకర్షించేందుకు అవసరమైన అన్ని కార్యక్రమాలు చేపట్టారు. అక్కడి పురావస్తు శాఖ మ్యూజియానికి కొత్త హంగులు అద్దడంతో పాటు 16వ శతాబ్దం నాటి ప్రసిద్ధి చెందిన రాజరాజేశ్వరీ దేవాలయాన్ని ముస్తాబు చేశారు. దాంతో ఇన్నాళ్లు ఎవరూ పట్టించుకోని ఆ ఆలయానికి సందర్శకుల తాకిడి పెరగనుంది. అధికార యంత్రాంగం తీసుకున్న శ్రద్ధ ఇలానే కొనసాగిస్తే పర్యాటకుల సంఖ్య పెరిగి, పిల్లల మర్రికి మళ్లీ పూర్వవైభవం రానుంది.

పెరిగిన సందర్శకులు

పిల్లలమర్రిని మిస్ వరల్డ్ పోటీదారులు శుక్రవారం సందర్శించడంతో క్షేత్రానికి శనివారం అనూహ్యంగా సందర్శకుల తాకిడి పెరగింది. అధిక సంఖ్యలో హాజరై ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. క్షేత్రాన్ని అందంగా ముస్తాబు చేయడంతో సందర్శకులు సరదాగా గడుపుతున్నారు. ఇంకా ఇక్కడ పర్యాటకుల కోసం చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేయాల్సి ఉంది. జూపార్క్, చిల్డ్రన్ పార్క్‌లను అభివృద్ధి చేస్తే సందర్శకుల సంఖ్య పెరగనుంది. సందర్శకులకు వసతులు కల్పించాలి. ముఖ్యంగా బాత్‌రూమ్‌లు, నీటి వసతి ఏర్పాటు చేయాల్సి ఉంది. ఉన్న ఒక సులభ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా మారడంతో చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, విద్యా సంస్థల నుంచి క్షేత్రాన్ని ఏటా సందర్శించేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలి. పర్యాటక, అటవీశాఖ, ఆర్కియాలజీ శాఖలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అభివృద్ధి చేస్తే మరికొన్ని శతాబ్దాల పాటు సందర్శకులను అలరించనుంది.

దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలి

- భూభారతిపై కలెక్టర్ సిక్తా పట్నాయక్ సమీక్ష


మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

మద్దూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): భూ భారతి దరఖాస్తుల పరిశీలన త్వరితగతిన పూర్తి చేయాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ చెప్పారు. భూ భారతి కొత్త చట్టం అమలు కోసం పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన మద్దూర్ మండలంలో రైతులు అందించిన దరఖాస్తుల పరిశీలన, వాటి పురోగతిపై కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలన్నారు. పరిష్కారం కోసం కమిటీలు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఫీల్డ్ వెరిఫికేషన్, ప్రొసిడింగ్స్, ల్యాండ్ సర్వే ఎంత వరకు వచ్చిందని ప్రత్యేక అధికారి యాదగిరిని అడిగి తెలుసుకున్నారు. తిరస్కరించిన దరఖాస్తులపై కచ్చితమైన స్పష్టత ఉండాలన్నారు. ఎందుకు తిర్కరించారో కారణాలను రైతులకు చెప్పాలన్నారు. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కారం చూపాలన్నారు. పరిష్కారం చట్ట ప్రకారం జరగాలన్నారు. పది రోజుల్లో వంద శాతం దరఖాస్తుదారులకు పరిష్కారం లభించేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో రాంచందర్, భూభారతి ప్రత్యేక అధికారి యాదగిరి, మద్దూర్, కొత్తపల్లి, కోస్గి తహసీల్దార్లు మహేష్‌గౌడ్, జయరాములు, శ్రీనివాస్, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బేసిక్స్ నేర్పించాలి

- కలెక్టర్ విజయేందిర బోయి
- శిక్షణ అంశాలను విద్యార్థులకు చెప్పాలి
- విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ
- ఉపాధ్యాయులకు ముగిసిన మొదటి విడత వేసవి శిక్షణ


శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మే 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజునే అన్ని తరగతుల విద్యార్థులకు బేసిక్స్ నేర్పించేలా దృష్టి సారించాలని కలెక్టర్ విజయేందిర బోయి చెప్పారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు మొదటి విడత వేసవి శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా కలెక్టర్, రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ జిల్లా కేంద్రంలోని జేపీఎన్‌ఈఎస్‌లో నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కలెక్టర్ ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి నిత్యం కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని చెప్పారు. నాణ్యమైన విద్య అందించాలని చెప్పారు. ప్రతీ విద్యార్థికి అర్థమయ్యేలా బోధించాలన్నారు. విద్యార్థులకు చదవడం, రాయడంతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పించాలన్నారు. రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకట నర్సమ్మ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. పాఠశాలల ప్రారంభం నాటికి స్టూడెంట్స్‌కు నోట్‌బుక్స్ పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందించనున్నట్లు తెలిపారు. అనంతరం డీఈవో ప్రవీణ్‌కుమార్, వయోజన విద్యా జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ శివయ్య, ఏఎంవో శ్రీనివాస్, సీఎంవో బైకాని బాలుయాదవ్‌లతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. రెండో విడత శిక్షణ ఈ నెల 20 నుంచి ప్రారంభం కానుంది. స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు జిల్లా కేంద్రంలో, ఎస్‌జీటీలకు జిల్లా కేంద్రంతోపాటు మండల కేంద్రాల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

చెరగని చరిత

- ఆకట్టుకుంటున్న ఉమ్మడి జిల్లాలోని మ్యూజియాలు
- అలంపూర్‌లో భద్రపరిచిన 100కుపైగా ఆలయాల విగ్రహాలు
- పిల్లలమర్రిలో పాతరాతి యుగపు పనిముట్లు, ఆయుధాలు
- మన్ననూరులో అడవులు, చెంచెల జీవనంపై అవగాహన
- నేడు అంతర్జాతీయ మ్యూజియమ్ డే

6


సీజన్ ముగిసినా అందని రైతు భరోసా


పత్తి చేను కలుపుతున్న మహిళా కూలీలు(ఫైల్)

- నారాయణపేట జిల్లాలో రైతులకు అందినవి రూ.147.41 కోట్లు
- ఇంకా అందాల్సినవి రూ.93 కోట్లు

నారాయణపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో యాసంగి పంటల కోతతో సాగుకాలం ముగిసింది. మరో పక్షం రోజుల్లో రైతులు వానాకాలం సాగుకు సమాయత్తం అవుతున్నారు. అయినా నేటికీ పలువురు రైతులకు యాసంగి రైతు భరోసా అందలేదు. ప్రభుత్వం నాలుగు ఎకరాల్లోపు రైతులకు మాత్రమే రైతు భరోసా అందించి, మిగతా వారికి ఇవ్వలేదు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన గ్రామాల్లో ఈ సారి రైతు భరోసాను మొదటి విడతలో ఎకరాకు రూ.6 వేల చొప్పున ఖాతాల్లో జమ చేసింది. విడతల వారీగా అందించింది. నాలుగు ఎకరాల పైబడి భూమి ఉన్న రైతులకు రైతు భరోసా అందించ లేదు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 1,42,909 మంది రైతులకు రూ.147.41 కోట్లను రైతుల ఖాతాలో జమ చేశారు. ఇంకా జిల్లాలో 33 వేల మంది రైతులకు సంబంధించి రూ.93 కోట్లు ఇవ్వాల్సి ఉంది. రైతు భరోసా అందడంలో ఆలస్యం కావడంతో ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగుకు యోగ్యమైన భూములకే రైతు భరోసా ఇస్తామన్న ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా, నాలుగు ఎకరాల వరకే వేసి, మిగతా రైతాంగానికి వెయ్యకపోవడం సరి కాదని అంటున్నారు. అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులేమో అందరికీ దశల వారీగా రైతు భరోసా అందుతుందని చెబుతున్నారు.








పిల్లలమర్రి మ్యూజియంలో ఆకట్టుకుంటున్న విగ్రహాలు


బుద్ధుడి విగ్రహం


మన్ననూరులోని పర్యావరణ విజ్ఞాన కేంద్రం

చెరగని చరిత

● మంత్రముగ్ధులను చేస్తున్న ప్రదర్శనలు ● ఆకట్టుకుంటున్న పురాతన విగ్రహాలు
● కట్టిపడేస్తున్న కట్టడాలు ● మనసును దోచేస్తున్న అటవీ, జంతు ప్రదర్శనలు

నేడు అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం

పురాతన కట్టడాలు.. అటవీ అందాలు.. జంతువులు.. పక్షులు, వాటి అవశేషాలు.. పలు శాసనాలు ఇలా అనేక రకాల ప్రదర్శనలు తిలకించి పలువురు మంత్రముగ్ధులవుతున్నారు. వీటిని పురావస్తు శాఖ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లోని మ్యూజియాల్లో ప్రదర్శనకు ఉంచారు. వీటిని తిలకించి ఆస్వాదించేందుకు వివిధ ప్రాంతాల పర్యాటకులు ఆసక్తి కనబరుస్తున్నారు. వాటిలో ప్రముఖంగా అలంపూరు మ్యూజియానికి ఎంతో ఆదరణ ఉన్నది. 100కు పైగా ఆలయాలు, చారిత్రక కట్టడాలు 6వ శతాబ్దం నుంచి 16వ శతాబ్దపు కాలం నాటివి ఇక్కడ చూడవచ్చు. అడవులు.. వన్యప్రాణులు.. అడవిలో జీవించే చెంచులు... విహరించే పలు రకాల పక్షులు ఎలా ఉంటాయో మన్ననూరులోని అటవీ పర్యావరణ మ్యూజియంలో ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తాయి. హైదరాబాద్ ప్రధాన మ్యూజియం నుంచి సేకరించిన శిల్పాలు, శాసనాలు, రాతియుగపు పనిముట్లు, పంచలోహ విగ్రహాలు మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి మ్యూజియంలో చూపరులను కట్టిపడేస్తాయి. ఆదివారం అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా జిల్లాలోని మ్యూజియాల గురించి క్లుప్తంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనాలు...



మహబూబ్‌నగర్ పిల్లలమర్రి మ్యూజియం


పిల్లలమర్రి మ్యూజియంలో నంది విగ్రహం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రిలో 1976లో ఒక ఎకరం విస్తీర్ణంలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి జలగం వెంగళ్‌రావు ఈ మ్యూజియాన్ని ప్రారంభించారు. ప్రారంభంలో హైదరాబాద్ ప్రధాన మ్యూజియం నుంచి సేకరించిన శిల్పాలు, శాసనాలు, రాతియుగపు పనిముట్లు, పంచలోహ విగ్రహాలు పిల్లలమర్రి మ్యూజియంలో ఉంచారు. ప్రధాన వస్తువుల ప్రదర్శనలతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అమ్రాబాద్, పదర, మూడుమాల్, ఉప్పేర్, ఈర్లదిన్నె, పాలకొండ, అల్వాల్‌పల్లి, గొల్లత్తగుడి, పూడూరు, నంది వడ్డెమాన్, పాన్‌గల్, కల్వకోలు, నెల్లికొండపల్లి, కొప్పునూర్, ఆవంచ తదితర ప్రాంతాల్లో తవ్వకాల్లో లభించిన పాత రాతియుగం పనిముట్లు, బృహత్ శిలాయుగపు పాత్రలు, విజయనగర రాజుల కాలంలో వాడిన ఆయుధాలు, కుతుబ్‌షాహీల, అసఫ్‌జాహీల కాలం నాటి ఆయుధాలు, విగ్రహాలు ఈ ప్రదర్శన శాలల్లో ఉంచారు. ఇవే కాకుండా 8, 9, 10, 11, 12, 13 15, 16, 17వ శతాబ్ది కాలాల్లో లభించిన పలు పురాతన వస్తువులను సేకరించి పురావస్తు అధికారులు ప్రజల సందర్శనార్థం ఇక్కడ ఉంచారు.

16వ శతాబ్దపు రాజరాజేశ్వరి ఆలయం

కృష్ణానది తీర ప్రాంతంలోని ఈర్లదిన్నె గ్రామంలో శ్రీశైలం డ్యాం నిర్మాణం సమయంలో ఏర్పడిన ముంపులో రాజరాజేశ్వరి మాత ఆలయం మునిగిపోయింది. ఎంతో చారిత్రక ప్రాముఖ్యత కలిగిన ఈ ఆలయాన్ని పరిరక్షించే ఉద్దేశంతో పురావస్తు శాఖ అధికారులు ఈ ఆలయాన్ని తిరిగి పిల్లలమర్రి ప్రాంతంలోని పురావస్తు ప్రదర్శన శాల ప్రాంగణంలో 1983లో తిరిగి పునఃప్రతిష్ఠ చేశారు. ఈ ఆలయం 16వ శాతాబ్దానికి చెందినది. మ్యూజియాన్ని సందర్శించడానికి వచ్చిన ప్రజలు ఆలయాన్ని కూడా దర్శించుకుంటారు. మ్యూజియం సమీపంలో మినీ జూపార్క్, జింకల పార్క్, చేపల ఎక్వేరియం, కుందేళ్లు, కోతులు, సరీసృపాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి, వీటితో పాటు పిల్లలు ఆడుకోవడానికి పలు రాకల వినోద పరికరాలు అందుబాటులో ఉన్నాయి.

కేంద్ర కార్యాలయంలో మ్యూజియం డే నిర్వహిస్తాం



ప్రపంచ మ్యూజియం డే వేడుకలు హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహిస్తాం. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన మ్యూజియానికి సంబంధించిన అధికారులందరూ కేంద్ర కార్యాలయంలో నిర్వహించే వేడుకల్లో పాల్గొంటారు. మహబూబ్‌నగర్‌లోని పురావస్తు మ్యూజియంలో శిల్ప విశిష్టత చూపరులను కనువిందు కల్పించే విధంగా ఉన్నాయి. శాతవాహనుల నుంచి అసఫ్ జాహీల రాజుల వరకు ముద్రించిన వెండి, సీసపు, రాగి, బంగారునాణేలు ఇక్కడి ప్రదర్శించిన వాటిలో ప్రధానమైనవి. బుద్ధ విగ్రహం, నందీశ్వరుడి రూపాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. మ్యూజియం అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు రూపొందించాల్సి ఉంది. వాటిని వరల్డ్ మ్యూజియం డే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి మ్యూజియం అభివృద్ధికి కృషి చేస్తాం. మ్యూజియంను సందర్శించే సందర్శకులకు సౌకర్యాలు కల్పిస్తాం.

\- నాగలక్ష్మి, ఏడీ, పురావస్తు శాఖ


పెద్దపులి బొమ్మ



పెద్దపులి వెన్నెముక



చిరుత పులి పుర్రె, అడవిపంది దవడ





కోతి పుర్రె



వివిధ రకాల అడవి పక్షులు

ప్రత్యేక ఆకర్షణగా పర్యావరణ మ్యూజియం

మన్ననూర్, (ఆంధ్రజ్యోతి): అడవులంటే ఎలా ఉంటాయి.. వన్యప్రాణులు ఎలా ఉంటాయి.. అడవిలో జీవించే చెంచులు ఎలా ఉంటారు... నల్లమలలో విహరించే పలు రకాల పక్షులు ఎలా ఉంటాయో పర్యటకులకు, సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణగా మారింది నాగర్‌కర్నూలు జిల్లా పరిధిలోని నల్లమలలోని మన్ననూరులోని అటవీ పర్యావరణ మ్యూజియం. ఈ మ్యూజియాన్ని నాగర్జున సాగర్, శ్రీశైలం అభయారణ్య ఏర్పాటైనప్పటి నుంచి 40 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. నల్లమల ప్రాంభమయ్యే మన్ననూరు చెక్‌పోస్టు ఆవరణలో విశాలమైన ప్రాంతంలో ఈ పర్యావరణ విజ్ఞాన కేంద్రాన్ని నిర్మించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అమ్రాబాద్ పులుల అభయారణ్యంగా మారిన తర్వాత ఈ మ్యూజియాన్ని మరింతగా అభివృద్ధి చేశారు. ఈ మ్యూజియాన్ని సందర్శించే వారికి అడవిలో తిరిగామన్న అనుభూతి కలుగుతోంది.

మ్యూజియంలోని ప్రదర్శనలు ఇలా...

నల్లమల అటవి సంచరించే వన్యప్రాణులు కల్పించేలా ఒక మ్యాప్‌ను చిత్రీకరించి అందంగా ప్రదర్శించారు. అడవిలో నివసించే చెంచుల వెదురుతో తడకలు అల్లుకొని అడవిలో లభించే గడ్డితో కప్పుకున్న పూరిగుడిసె.. వెదురు బుట్టల సిద్ధం చేసుకొని అటవీ ఉత్పతులకు సిద్ధమైన చెంచు గిరిజనులతో కూడిన ఫొటో.. అడవిలో సంచరించే పెద్దపులి, చిరుత పులి బొమ్మలు.. ఇలా అమ్రాబాద్ అడవుల్లో విహరించే పలురకాల పక్షులు, అడవి కోడి, పెద్దపులి వెన్నెముక, చిరుత పులి పుర్రె, అడవిపంది పైదవడ, కోతి పుర్రె, ముళ్లపంది ముళ్లు, కృష్ణ జింక కొమ్ము, చుక్కల దుప్పి కొమ్ములను ప్రదర్శించారు. అలాగే అడవిలో లభించే కరక్కాయలు, చిల్లగింజలు, ముష్టిగింజలు, తిప్పతీగ, తేనెపట్టు మైనము వంటివి మ్యూజియంలో ప్రదర్శిస్తున్నారు. సఫారీ పర్యటనకు వచ్చే పర్యటకులందరినీ గైడ్‌లో ఈ కేంద్రంలో ప్రదర్శనకు తీసుకువస్తారు. మొదట ఈ నల్లమల అడవి ఇక్కడ నివసించే వన్యప్రాణులు, పక్షులు, అడవిలో లభించే వన మూలికలు, పండ్లు తదితర విషయాలను పర్యాటకులకు అవగాహన కల్పిస్తారు. వారంతపు సెలవుల్లో వచ్చే పర్యాటకులు ఈ కేంద్రాన్ని సందర్శించి నల్లమల విషయాలను తెలుసుకుంటారు. కేంద్రంలో డిజిటల్ తెరపై అమ్రాబాద్ పులుల అభయారణ్యం విస్తీర్ణం, అడవిలో సంచరించే వన్యప్రాణులు, అటవీశాఖ ద్వారా ఏర్పాటు చేసిన బేస్ క్యాంపుల్లో టైగర్ ప్రోటక్షన్ వాచర్ల సేవలు, చెక్‌డ్యామ్‌లు, సాసర్‌బీట్ల ద్వారా వన్యప్రాణులకు తాగునీరు అందించే విధానం తదితర విషయాలను వివరిస్తూ పర్యటకులకు అవగాహన కల్పిస్తారు.

మైదాన ప్రాంతాల వారికి పర్యావరణ విజ్ఞానం అందించేందుకే...




మైదాన ప్రాంతంలో ఉండే వారికి నేటితరం చిన్నారులకు పర్యావరణ విజ్ఞానం అందించాలనే ఉద్దేశంతోనే మన్ననూరు చెక్‌పోస్టు ఆవరణలో చాలా ఏళ్లుగా మ్యూజియాన్ని ఏర్పాటు చేశాం. ప్రతీ రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా ఈ కేంద్రంలో సందర్శకులకు అనుమతిస్తాం. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ తదితర విషయాలను తెలుపుతూ తమ సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తాం. ఈ కేంద్రాన్ని సందర్శిస్తే అడవిలో తిరిగామన్న అనుభూతి ప్రతి ఒక్కరికి కలుగుతుంది.

\- దేవజ, మన్ననూరు అటవీ రేంజ్ అధికారి


అలంపూర్ ఆలయ ప్రాంగణంలో ఉన్న పుర ప్రదర్శనశాల






పురావస్తు శాఖలో ఉన్న శిల్పాలు, శాసనాలు

చారిత్రక నిలయం అలంపూరు మ్యూజియం

అలంపూరు, (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల చరిత్ర గల అలంపూరు మ్యూజియా నికి ఎంతో ఆదరణ ఉంది. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు ఈ మ్యూజియాన్ని తిలకించేందుకు ఆసక్తి చూపుతారు. 100కు పైగా ఆలయాలు, చారిత్రక కట్టడాలు 6వ శతాబ్ద కాలం నుంచి 16వ శతాబ్ద కాలం నాటివి ఇక్కడ చూడవచ్చు. శ్రీశైలం జల విద్యుత్ వల్ల అలంపూరు చరిత్ర కొంత కాలగర్భంలో కలిసిపోయింది. కోటిలింగాలు, నూట ఒకటి గ్రామాలు, 64 స్నాన ఘట్టాలు ముంపునకు గురయ్యాయి. అలాగే 13వ శతాబ్ద కాలంలో బహమనీ సుల్తానుల దాడిలో ఆలయాలు, శిలా విగ్రహాలు ధ్వంసం కావడం వల్ల అప్పటినుంచి శ్రీశైలం డ్యాం కట్టిన తర్వాత ఈ విగ్రహాలు, శాసనాలు దొరికినవి దొరికినట్లుగా వాటిని పురావస్తు శాఖలో భద్రపరిచారు. 1953లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ఉపరాష్ట్రపతిగా ఉన్నపుడు అలంపూరులో జరిగిన ప్రపంచ కవి సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా హాజరై ఇక్కడ స్థల ప్రదర్శన శాలను, హైస్కూల్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం అలంపూరు నవబ్రహ్మ ఆలయాల ప్రాంగణంలో రాష్ట్ర పురావస్తు శాఖ వారు స్థల ప్రదర్శనశాల(మ్యూజియం) ఏర్పాటు చేశారు. ఇక్కడ ఎంతో విశేషమైన ఏకశిలా విగ్రహం, శిల్పాలు, శాసనాల గురించి తెలుసు కోవడానికి పర్యాటకులు, భక్తులు ఎంతో ఆసక్తి చూపిస్తున్నారు.


చెంచులు నివసించే పూరిల్లు
అడవి కోడి



రేపటి సీఎం సభకు సర్వం సిద్ధం

అచ్చంపేట/అమ్రాబాద్/వంగూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి హోదాలో అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో ఆదివాసి గిరిజనుల అభివృద్ధి కోసం ఇందిర సౌర గిరి జల వికాసం పథకం ప్రారంభించేందుకు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లను అధికారులు చేశారు. ఐటీడీఏ పరిధిలో ఉన్న చెంచు పెంటల నుంచి ఆదివాసులను తరలించేందుకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయగా, నియోజకవర్గం నుంచి 10వేల మంది మహిళా సంఘాల సభ్యులను తరలించేందుకు రంగం సిద్ధం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ క్యాంపు కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించి కార్యకర్తలకు నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి సభ కోసం దాదాపు 1200మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సీఐ శంకర్ నాయక్ తెలిపారు. ఇప్పటికే సభ పరిసరాలను పరిశీలించినట్లు తెలిపారు.

పైలాన్ పనులను త్వరగా ముగించాలి
● కలెక్టర్ బదావత్ సంతోష్

చెంచు రైతుల పొలాల్లో ప్రవేశపెట్టనున్న ఇందిర సౌర గిరి జల వికాస పథకం పైలాన్ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తో కలిసి ఈ నెల 19న సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్న పైలాన్ పనులను ఆయన పరిశీలించారు. సీఎం రేవంత్ రెడ్డి పైలాన్ ఆవిష్కరించడానికి ఒక్కరోజే మిగిలి ఉన్నందున


పైలాన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ

అధికారులు వేగవంతంగా పైలాన్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ పథకం రూ.12వేల 600 కోట్లతో, 6లక్షల ఎకరాలలో, 2లక్షల 10వేల మంది రైతులకు రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధి జరగనుందన్నారు. ఈ పథకంలో భాగంగా అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో 50 ఎకరాల విస్తీర్ణంలో 26 మంది రైతులు లబ్ధి పొందనున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పోలీసు అధికారులతో భద్రత ఏర్పాట్లను పరిశీలిం చారు.

● వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామాన్ని శనివారం అడిషనల్ కలెక్టర్ అమరేందర్ సందర్శించారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి వస్తున్నారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్ స్థలాన్ని అధికారులతో కలిసి అడిషనల్ కలెక్టర్ అమరేందర్ పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లుతో పోలీస్, ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులతో ఆయన సమావేశమయ్యారు.

రూ.2 కోట్లు వాపస్..
వెనక్కి వెళ్లిన స్వచ్ఛభారత్ నిధులు..

గద్వాల, మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత మహిళల ఆత్మగౌరవం కాపా డేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన స్వచ్ఛభారత్ మిషన్ నిధులు రూ.2కోట్లకు పైగా వెన క్కి వెళ్లాయి. అన్ని జిల్లాలలో కొన్ని నెలల నుంచి వీటిని ఉప యోగించుకోకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులను వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తోంది. అ యితే గ్రామాలలో నిరుపేదలు ఇంకా బహిరంగ మలమూత్ర విసర్జన చేస్తున్నారు. వారికి వ్యక్తిగత మరు గుదొడ్డి నిర్మించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛభారత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ లక్ష్యం నెరవేరక ముందే ఈ నిధులను రాష్ట్ర ప్ర భుత్వం వెనక్కి తీసుకోవడంపై గ్రామీణ ప్రాంత ప్రజలు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గద్వాల జిల్లాకు 62,415 మరుగుదొడ్లు మంజూరు ..

కేంద్ర ప్రభుత్వం 2014 అక్టోబరులో స్వచ్ఛభారత్ అభియాన్ పథకాన్ని ప్రారంభించింది. మొదటి, రెండో దశలో మొత్తం కలిపి 62,415 మరుగుదొడ్లను మంజూరు చేసింది. ఇందుకోసం రూ.74.52 కోట్లు విడుదల చేసింది. నిరుపేద కుటుంబాలు మరుగుదొడ్ల నిర్మాణం చేసుకునేందుకు ఒక్కో కుటుంబానికి రూ.12వేల సబ్సిడీని అందించింది. మొదటి దశ 2019 వరకు నిర్మాణ బాధ్యతలు కాంట్రాక్టర్‌లకు అప్పగించారు. ఆ తర్వాత రెండో దశలో లబ్ధిదారుడే వ్యక్తిగతంగా నిర్మించుకుంటే వారి ఖాతాలలోనే నగదు రూ.12 వేలు జమ చేసేందుకు నిర్ణయించారు. ఇలా పదేళ్లలో జిలాలో 61,584 మరుగుదొడ్లు నిర్మాణం అయ్యాయి. రెండో దశలో నిర్మించుకున్న లబ్ధిదారుడి ఖాతాలలో సబ్సిడీ మొత్తం రూ.12వేలు జమచేసే విషయంలో పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేశారు. చాలా మందికి ఈ డబ్బులు జమ కాలేదని లబ్ధిదారులు ఆరోపణలు చేశారు.

వెనక్కి వెళ్లిన నిధులు..

కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు స్వచ్ఛభారత్ నిధులను విలేజ్ వాటర్ అండ్ సానిటేషన్ కమిటీ ఖాతాలలో నిధులు జమ చేసింది. కాంగ్రెస్ ప్రభు త్వం వచ్చిన తర్వాత స్వచ్ఛభారత్‌పై పూర్తిగా దృష్టి పెట్టకపోవడంతో మరు గుదొడ్ల నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగింది. లబ్ధిదారులకు చెల్లింపులు కాని నిధులు విలేజ్ వాటర్ అండ్ సానిటేషన్ కమిటీ ఖాతాలలో ఉన్నాయి. కొన్ని నెలల నుంచి వీటిని ఉపయోగించుకోకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామాలలోని విలేజ్ కమిటీలో ఉన్న నిధులను వాపస్ పంపించాలని సూచించింది. జిల్లా అధికారులు కూడా నిధులు వాప సు చేసేముందు ఎవరికైనా బిల్లులు పెండింగ్‌లో ఉంటే చెల్లించాలని సూచించారు. కానీ పంచాయతీ కార్యదర్శులు రెండేళ్ల నుంచి ఇద్దరు ముగ్గురు బదిలీలు కావడంతో వారికి చెల్లింపులపై అవగాహనలేక ఉన్న నిధులన్నింటిని వాపసు పంపించినట్లు తెలుస్తోంది.

నిధులు వెనక్కి వెళ్లేముందు చేతివాటం...!

స్వచ్ఛభారత్ మిషన్ నిధులు వెనక్కి వెళ్లేముందు పంచాయతీ కార్యదర్శులు చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు వస్తున్నాయి. గద్వాల మండలం అ నంతాపురం గ్రామ పంచాయతీలో జరిగిన అవినీతి ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. ఈ గ్రామ కార్యదర్శి స్వచ్ఛభారత్ మిషన్ నిధులను రూ.7లక్షల వరకు తన వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకున్నట్లు అధికారుల విచారణలో బహిర్గతం అయ్యింది. దీంతో పంచాయతీ కార్యదర్శిని అధికారులు సస్పెండ్ చేశారు. జిల్లాలో మరికొందరు వీటిని వ్యక్తిగత ఖాతాలు, బినామీ ఖాతాలలోకి మళ్లించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ చేస్తే మరికొంతమంది అవినీతి బహిర్గతం అయ్యే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ ఆదేశం మేరకే...

ప్రభుత్వం ఆదేశం మేరకే స్వచ్ఛభారత్ నిధులు పంచాయతీల నుంచి వా పస్ చేశాం. వాపస్ చేసే ముందే ఎవరికైనా చెల్లింపులు ఉంటే చెల్లించాలని కార్యదర్శులకు సూచించాం. ఆ తర్వాతే పంపించాం. ఇవి మిగులు నిధులు మాత్రమే.. ఎవరికీ చెల్లింపులు ఆపలేదు.

\- నాగేంద్రం, ఇన్‌చార్జి డీపీవో, గద్వాల జిల్లా

పాక్‌కు సైనిక రహస్యాలు

(మొదటి పేజీ తరువాయి)


జ్యోతి మల్హోత్రా

అక్కడి ఎలక్ట్రానిక్ సెన్సార్లను చిత్రీకరించి వాట్సాప్, టెలిగ్రామ్‌ల ద్వారా పాక్ ఏజెంట్లకు చేరవేసిందని పేర్కొన్నారు. ఈ కేసులో జ్యోతి మల్హోత్రాని శనివారం అరెస్టు చేయగా న్యాయస్థానం ఐదు రోజుల రిమాండ్ విధించింది.

ఇలా పట్టేశారు...

చిత్రీకరించిన సైనికపరంగా సున్నితమైన వీడియోల ఫుటేజీ మొత్తాన్ని ఆమె వెంటనే పాక్ హై కమిషన్ కార్యాలయం నుంచి భారత్ బహిష్కరించిన ఉద్యోగి అహ్‌సాన్ ఉర్ రహీమ్ అలియాస్ డానిష్ నంబరుకు పంపిస్తోందని హరియాణా-పంజాబ్ సైబర్ సెల్ పోలీసులు గుర్తించారు. పోలీసులు అరెస్టు చేసిన మరో ఐదుగురి వద్దా ఆ నెంబరును గుర్తించారు. 'ఆపరేషన్ గోస్ట్ సిమ్' పేరిట చేసిన పరిశోధనలో వీరందరిని గుర్తించి అధికారిక రహస్యాలు అక్రమంగా చేరవేసిన కేసులో అరెస్టు చేశారు.

ఇఫ్తార్ విందులో...

మల్హోత్రా గత ఏడాది మార్చిలో పోస్ట్ చేసిన ఓ వీడియోలో ఢిల్లీలోని పాక్ హై కమిషన్ కార్యాలయంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం కనిపిస్తోంది. ఇందులో అక్కడి ఏర్పాట్లను ఆమె ఎంతో మెచ్చుకున్నారు. పాకిస్థాన్ మరెన్నోసార్లు వెళ్లాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. పాక్ హై కమిషన్ ఉద్యోగి డానిష్‌తో సంభాషిస్తూ ఆమె ఆ వీడియోలో కనిపించారు. గతంలో తాము కలుసుకున్న సందర్భాలనూ ప్రస్తావించారు. అతడి భార్యతోనూ చనువుగా మాట్లాడారు. సాధారణ పరిచయాన్ని మించిన సన్నిహితత్వం వారి మధ్య కనిపించింది. కాగా జ్యోతి మల్హోత్రాతో పాటు మరో ఇద్దరు మహిళలు, ముగ్గురు యువకులను హరియాణా పోలీసులు ఈ కేసులో అరెస్టు చేశారు. వీరి నెట్‌వర్క్ హరియాణా, పంజాబ్ రాష్ట్రాలతోపాటు ఉత్తర భారతమంతా విస్తరించినట్లు భావిస్తున్నారు. 'ట్రావెల్ విత్ జో' పేరిట యూట్యూబ్ చానల్ నడుపుతోన్న జ్యోతి మల్హోత్రా 2023లో పాకిస్థాన్‌కు వెళ్లింది. ఆ సమయంలో ఢిల్లీలోని పాకిస్థాన్ హై కమిషన్ కార్యాలయంలో పనిచేసే డానిష్ ఆమెకు పరిచయమయ్యాడు. ఇతడు జ్యోతికి పలువురు పాకిస్థాన్ ఏజెంట్లను పరిచయం చేశాడు. వాట్సాప్, టెలిగ్రామ్, స్నాప్‌చాట్‌ల ద్వారా జ్యోతి వారితో టచ్‌లో ఉంది. షకీర్ అలియాస్ రాణా షహబాజ్ అనే పాక్ ఏజెంట్ వారిలో ఒకడు. అతడి నంబరును జాట్ రణ్‌ధావా పేరుతో జ్యోతి సేవ్ చేసుకుంది. సామాజిక మాధ్యమాల్లో పాక్ గురించి మంచిగా ప్రచారం చేసేందుకు ఈమెను ఉపయోగించుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఒక పాక్ ఏజెంట్‌కు బాగా దగ్గరయిన జ్యోతి అతడితో ఇండోనేషియా పర్యటనకూ వెళ్లింది. కాగా డానిష్‌ను ఈ నెల 13న కేంద్రం అవాంఛనీయ వ్యక్తిగా ప్రకటించి దేశం విడిచి వెళ్లాల్సిందిగా ఆదేశించింది. జ్యోతితో పాటు పంజాబ్‌లోని మలేర్‌కోట్లకు చెందిన మరో వితంతు మహిళ గుజాల(32) కూడా ఈ కేసులో కీలక నిందితురాలు. వీసా కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో పాక్ హై కమిషన్ కార్యాలయానికి వెళ్లిన ఆమెకు డానిష్ పరిచయమయ్యాడు. అతడితో తరచూ మాట్లాడుతూ ఉండేది. పెళ్లి చేసుకుంటానని డానిష్ ఆమెకు దగ్గర అయ్యాడు. ఏప్రిల్ 23న గుజాల మలేర్‌కోట్లకే చెందిన వితంతు మహిళ బాను నస్రీనను పాక్ హై కమిషన్ కార్యాలయానికి తీసుకువెళ్లగా డానిష్ ఆమెకు మరుసటి రోజే పాక్ వీసా ఇప్పించాడు. కాగా ఈ కేసులో అరెస్టయిన మరో ముగ్గురు వ్యక్తులు మలేర్‌కోట్లకు చెందిన యమీన్ మహమ్మద్, పటియాలలోని ఖల్సా కళాశాల విద్యార్థి దేవిందర్ సింగ్ ధిల్లాన్, నుహ్‌కు చెందిన అర్మాన్. యమీన్ డానిష్‌తో కలిసి ఆర్థిక, వీసా జారీ వ్యవహారాలు నడిపాడు. ధిల్లాన్ మే 12న తన ఫేస్‌బుక్ ఖాతాలో గన్, పిస్టల్ చిత్రాలను పోస్ట్ చేశాడు. దీంతో అతడిని అరెస్టు చేసిన పోలీసులు పలు కీలక వివరాలు రాబట్టారు. గత ఏడాది నవంబరులో కర్తార్‌పూర్ కారిడార్ ద్వారా పాక్ వెళ్లిన అతడు అక్కడ ఐఎస్ఐ ఏజెంట్లకు భారత్‌కు సంబంధించిన సున్నిత సమాచారాన్ని అందజేశానని వెల్లడించాడు. అందుకు తనకు పెద్దమొత్తంలో డబ్బు ముట్టిందని చెప్పాడు. పటియాల కంటోన్మెంట్ వీడియోలూ ఇతడు పాక్‌కు పంపినట్లు గుర్తించారు. అర్మాన్ సిమ్ కార్డులు సమకూర్చడం, డబ్బు పంపిణీ వ్యవహారాలు చేశాడు. అంతేగాక పాక్ ఏజెంట్ల సూచనల మేరకు డిఫెన్స్ ఎక్స్‌పో-2025ని కూడా సందర్శించాడు. కాగా నిందితులంతా తమ నేరాలను అంగీకరించారు. పాక్ ఏజెంట్లు సమాజంలో మతపరంగా, సామాజికంగా సున్నిత మనస్తత్వం గలవారిని గుర్తించి డబ్బు, ప్రేమ, పెళ్లి పేరిట వలలో వేసుకుంటున్నారని పోలీసులు తెలిపారు.

పాలస్తీనా ప్రజలంతా లిబియాకు?

వాషింగ్టన్, మే 17: ఇజ్రాయెల్ దాడుల్లో కకావికలమైన గాజా ప్రాంతం నుంచి పాలస్తీనీయులను ఖాళీ చేయించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగం కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. సుమారు పది లక్షల మంది పాలస్తీనా ప్రజలను శాశ్వతంగా లిబియాకు తరలించనున్నట్టుగా అమెరికా అధికార వర్గాలను ఉటంకిస్తూ.. ఎన్‌బీసీ న్యూస్ కథనాన్ని ప్రచురించింది. దీనికి సంబంధించి లిబియా ప్రభుత్వంతో అమెరికా సీనియర్ అధికారులు చర్చలు జరుపుతున్నారని పేర్కొంది. పాలస్తీనా ప్రజల తరలింపునకు బదులుగా అమెరికా ఫ్రీజ్ చేసిన వేల కోట్ల రూపాయల లిబియా నిధులను విడుదల చేస్తామని ప్రతిపాదించినట్టు తెలిపింది. పూర్తిగా విధ్వంసమైన గాజా పరిస్థితి ఏమీ బాగోలేదని, ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని, వారిని ఖాళీ చేయించి.. దానిని స్వేచ్ఛా ప్రాంతం(ఫ్రీడమ్ జోన్)గా అభివృద్ధి చేస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతంలోనే ప్రకటించడం గమనార్హం. మరోవైపు పాలస్తీనా తమ మాతృభూమి అని, దాన్ని రక్షించుకునేందుకు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని పాలస్తీనా హమాస్ సీనియర్ అధికారి బసెమ్ స్పష్టం చేశారు. లిబియాలో సుమారు 14 ఏళ్ల క్రితం అంతర్యుద్ధం చెలరేగింది. అప్పటి నుంచీ ఆ దేశంలో పరిస్థితి అస్తవ్యస్తంగానే ఉంది. లిబియా పశ్చిమ ప్రాంతంలో అబ్దుల్ హమీద్ నేతృత్వంలో, తూర్పు ప్రాంతంలో ఖలీఫా హఫ్తార్ నేతృత్వంలో పాలన కొనసాగుతోంది. మొత్తం దేశంపై పట్టు కోసం ఈ రెండు వర్గాల మధ్య అంతర్యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఇదిలా ఉండగా, ఆపరేషన్ 'గిడియాన్స్ చారియట్స్' పేరుతో ఇజ్రాయెల్ శనివారం గాజాపై విరుచుకుపడింది. ఈ దాడుల్లో 100 మంది మరణించారు. గాజా భూభాగంలో యుద్ధాన్ని ఉధృతం చేయడంలో భాగంగా అపహరణకు గురైనవారి విడుదలతో పాటు హమాస్‌ను ఓడించడం వంటి లక్ష్యాలను సాధించడానికే ఈ ఆపరేషన్ చేపట్టినట్లు ఇజ్రాయెల్ సైన్యం 'టెలిగ్రాం'లో పోస్టు చేసింది.

ట్రంప్ నోట మళ్లీ జీరో టారిఫ్ మాట!




న్యూయార్క్, మే 17: భారత సుంకాల విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి అక్కసు వెళ్లగక్కారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 100 శాతం సుంకాలను తగ్గించుకోవడానికి భారత్ సిద్ధంగా ఉందంటూ మళ్లీ మొదటికొచ్చారు. ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం కోసం తానేమీ తొందరపడటం లేదని చెప్పారు. తాజాగా ఓ న్యూస్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. 'ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటి. వారు వ్యాపారాలు చేయడాన్ని దాదాపు అసాధ్యం చేస్తున్నారు. ప్రతీకార సుంకాల నేపథ్యంలో అమెరికాకు 100% సుంకాలు తగ్గించుకునేందు (జీరో టారిఫ్‌ల) కు సిద్ధంగా ఉన్నారు. ఆ దేశంతో త్వరలోనే వాణిజ్య ఒప్పందం అమల్లోకి రానుంది. ఈ విషయంలో నాకేం తొందరలేదు. మాతో ఒప్పందానికి చాలా దేశాలు ముందుకొస్తున్నాయి. అందరితో ఒప్పందాలంటే మా వల్ల కాదు. ప్రస్తుతం భారత్‌తో చర్చలు జరుగుతున్నాయి' అంటూ వ్యాఖ్యానించారు. ఇదివరకు ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలే చేయగా.. భారత్ తోసిపుచ్చింది.

'నీట్' ఫలితాల విడుదలపై మద్రాస్ హైకోర్టు స్టే

చెన్నై, మే 17(ఆంధ్రజ్యోతి): 'నీట్' ఫలితాల విడుదలపై మద్రాసు హైకోర్టు స్టే విధించింది. దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర యూజీ వైద్య కోర్సులకు మే 4న నీట్‌ను నిర్వహించారు. పరీక్ష జరుగుతున్న సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందిపడిన తమకు మళ్లీ పరీక్ష నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయాలంటూ తిరువళ్లూర్, రాణిపేట జిల్లాలకు చెందిన 13మంది విద్యార్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలను విచారించిన మద్రాసు హైకోర్టు.. ఫలితాల విడుదలపై స్టే విధించింది.

మా ఎయిర్‌బేస్‌లను భారత్ దెబ్బతీసింది



నూర్‌ఖాన్ వైమానిక స్థావరంపై దాడి చేసింది

- తొలిసారి అంగీకరించిన దాయాది దేశం
- దాడుల విషయం ఆర్మీచీఫ్ అర్ధరాత్రి తెలిపారు
- ధ్రువీకరించిన ప్రధాని షెహబాజ్ షరీఫ్

న్యూఢిల్లీ, మే 17 : ఆపరేషన్ సిందూర్ దెబ్బ బలంగా తగిలిన విషయం ఎట్టకేలకు దాయాది దేశం అంగీకరించింది. తమ వైమానిక స్థావరాలపై భారత్ దాడులు జరిపిందని పాకిస్థాన్ తొలిసారి ఒప్పుకొంది. రావల్పిండిలోని నూర్‌ఖాన్ సహా పలు ప్రాంతాల్లోని ఎయిర్‌బేస్‌లపై ఈ దాడులు జరిగాయని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ స్వయంగా ధ్రువీకరించారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలు, ఎయిర్‌బేస్‌లపై విరుచుకుపడిన విషయం తెలిసిందే. తమ ఎయిర్‌బేస్‌లు లక్ష్యంగా దాడులు జరిగినట్టు ఈ నెల 10వ తేదీ తెల్లవారుజామున, 2.30 గంటలకు, ఆర్మీ చీఫ్ మునీర్ ఫోన్‌చేసి తనకు తెలిపారని షెహబాజ్ వివరించారు. ఆయన ప్రకటనకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ఆ వీడియోను అనుసరించి.. ప్రధాని షరీఫ్ శుక్రవారం రాత్రి ఓ కార్యక్రమంలో మాట్లాడారు. భారత క్షిపణులు తమ లక్ష్యాన్ని చేరుకున్నాయని ఆయన అంగీకరించారని పాకిస్థాన్‌కు చెందిన జియో న్యూస్‌ను ఉటంకిస్తూ ఏఎన్ఐ వార్తాసంస్థ తెలిపింది. భారత్ దాడులను ఎదుర్కొనేందుకు స్వదేశీ సాంకేతికతతోపాటు చైనా తయారీ జెట్లను వైమానిక దళం ఉపయోగించిందని తెలిపారు. కాగా, పాక్ ప్రధాని వ్యాఖ్యల వీడియోను బీజేపీ నేత అమిత్ మాలవీయా 'ఎక్స్'లో పంచుకున్నారు. "నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ సహా ఇతర స్థావరాలను భారత్ పేల్చివేసిందని స్వయంగా పాకిస్థాన్ అంగీకరించింది. పాక్‌లో బాగా లోపలకు చొచ్చుకెళ్లి మనం జరిపిన క్షిపణి దాడుల వార్తలతో అర్ధరాత్రి ప్రధాని షెహబాజ్ షరీఫ్ నిద్రలేశారు. ఆపరేషన్ సిందూర్ విధ్వంస విస్తృతి ఏ స్థాయిలో ఉన్నదనేది ఇది తెలియజేస్తోంది" అని ఆయన తెలిపారు.

కాంగ్రెస్‌ను కాదని థరూర్‌కు పట్టం

(మొదటి పేజీ తరువాయి)

మా పార్టీ అధ్యక్షుడు ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీని.. అఖిలపక్షం బృందాలకు పేర్లను పంపాలని కోరారు. కేంద్ర మాజీ మంత్రి ఆనంద్ శర్మ, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్, రాజ్యసభ ఎంపీ సయ్యద్ నాసిర్ హుస్సేన్, లోక్‌సభ ఎంపీ రాజా బ్రార్ పేర్లను రాహుల్‌గాంధీ ప్రతిపాదించారు. కేంద్రం మాత్రం ఏకపక్షంగా శశిథరూర్ పేరును ప్రకటించింది. దీన్ని బట్టి, ముందుగానే పేర్లను నిర్ణయించుకుని, నామమాత్రంగా ఖర్గే, రాహుల్‌ను పేర్లివ్వాలని అడిగారని స్పష్టమవుతోంది" అని వ్యాఖ్యానించారు. ట్రంప్ మధ్యవర్తిత్వ ప్రకటనపై మోదీ మౌనం వీడడం లేదని ఎద్దేవా చేశారు.


థరూర్, రవిశంకర్, బైజయంత్, సంజయ్‌కుమార్ ఝా, కనిమొళి, సుప్రియా సూలే, శ్రీకాంత్ శిందే

ఆ ఏడుగురు ఎంపీలు వీరే..

ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించబోమనే సందేశాన్ని ఐక్య రాజ్య సమితి(ఐరాస) భద్రతామండలిలోని సభ్య దేశాలతోపాటు.. ఇతర ప్రధాన భాగస్వామ్య దేశాలకు వివరించేందుకు కేంద్ర ప్రభుత్వం శనివారం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది. ఒక్కో బృందంలో ఆరేడుగురు ఎంపీలతో పాటు.. సీనియర్ దౌత్యవేత్తలు, మాజీ రాయబారులుంటారు. ఈ బృందాలకు.. ఏడుగురు ఎంపీలు నేతృత్వం వహిస్తారు. వీరిలో నలుగురు అధికార ఎన్డీయే కూటమి, మరో ముగ్గురు విపక్ష ఇండియా కూటమి పార్టీల పార్లమెంట్ సభ్యులు. ఈ జాబితాలో శశిథరూర్(కాంగ్రెస్), రవిశంకర్‌ప్రసాద్(బీజేపీ), బైజయంత్ పాండా(బీజేపీ), సంజయ్‌కుమార్ ఝా(జేడీయూ), కనిమొళి(డీఎంకే), సుప్రియా సూలే(ఎన్‌సీపీ-శరద్‌పవార్), శ్రీకాంత్ శిందే(శివసేన) ఉన్నారు. ఈ నెల 22 తర్వాత ఈ బృందాలు విదేశాలలో పర్యటించే అవకాశాలున్నాయి. పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది చనిపోవడం, పాక్‌పై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్', పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రవాదంపై ఈ బృందాలు విదేశాలలో ప్రచారం చేస్తాయి.


పీవీ బాటలో మోదీ!

దౌత్య యుద్ధంపై మాజీ ప్రధాని పీవీ బాటనే ఇప్పుడు మోదీ ఎంచుకున్నట్లు తెలుస్తోంది. 1994లో కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందంటూ పాకిస్థాన్ దుష్ప్రచారం చేసింది. జెనీవాలోని ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల కమిషన్‌లో తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. దాంతో పీవీ అప్పటి విపక్ష నేత వాజ్‌పేయి నేతృత్వంలో ఓ ప్రతినిధి బృందాన్ని జెనీవాకు పంపించారు. ఆ బృందంలో అప్పటి జమ్మూకశ్మీర్ సీఎం ఫరూక్ అబ్దుల్లా, సల్మాన్ ఖుర్షీద్, హమీద్ అన్సారీ ఉన్నారు. వీరి దౌత్య నీతితో పాక్ ప్రవేశపెట్టిన తీర్మానం వీగిపోయింది. 2008లో కూడా ముంబై ఉగ్రదాడుల్లో పాక్ ప్రమేయముందనే సందేశాన్ని ప్రపంచదేశాలకు అందించేందుకు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ బృందాలను పంపారు. ఇప్పుడు మోదీ కూడా.. పాక్ కుతంత్రాలపై ప్రపంచానికి వివరించే ప్రయత్నం చేస్తున్నారు.

డీ4 వ్యవస్థ కోసం బీఈఎల్, ఆర్మీ మధ్య ఒప్పందం

డ్రోన్ దాడులను సమర్థవంతంగా అడ్డుకునేందుకు దోహదపడే ఇంటిగ్రేటెడ్ డ్రోన్ డిటెక్షన్ అండ్ ఇంటర్‌డిక్షన్ సిస్టమ్ (ఐడీడీఐఎస్ లేదా డీ4)కు సంబంధించి భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్), భారత ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ శుక్రవారం ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ వ్యవస్థను మేక్ ఇన్ ఇండియాలో భాగంగా డీఆర్‌డీవో, బీఈఎల్‌లు సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. శత్రు డ్రోన్లను గుర్తించడంతోపాటు ట్రాక్ చేయడం, ధ్వంసం చేయడానికి ఐడీడీఐఎస్‌ను అభివృద్ధి చేశారు. ఇది గగనతల ముప్పుల నుంచి రక్షణ కల్పించడంలో కీలకంగా మారుతోంది. గత ఏప్రిల్ 7 తర్వాతి నుంచి అదనంగా రూ.572 కోట్ల విలువైన ఆర్డర్లను పొందినట్టు బీఈఎల్ వెల్లడించింది. సంస్థ పొందిన ప్రధాన ఆర్డర్లలో ఐడీడీఐఎస్‌తో పాటు సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ రేడియో(ఎస్‌డీఆర్), జామర్లు, విడిభాగాలు వంటివి ఉన్నాయి.

లోకం తీరు



తుర్కియేకు అమెరికా 'సైడ్ విండర్' క్షిపణులు

న్యూఢిల్లీ, మే 17 : తుర్కియేకు 304 మిలియన్ డాలర్ల విలువైన క్షిపణులను విక్రయించే ఒప్పందానికి ఇటీవల ఆమోదం తెలిపిన అమెరికా.. ఆ ఒప్పందంలో భాగంగా 60 ఏఐఎం-9ఎక్స్ సైడ్ విండర్ క్షిపణులను సరఫరా చేయనుంది. స్వల్ప శ్రేణి ఎయిర్ టు ఎయిర్ క్షిపణి అయిన సైడ్ విండర్‌ను ఎఫ్-16వీ యుద్ధ విమానాల్లో వినియోగించవచ్చు. గగనతలంలో యుద్ధ విమానాల మధ్య జరిగే పోరులో ఈ సైడ్ విండర్ క్షిపణులు అత్యంత ప్రభావం చూపుతాయి. తుర్కియే ఇటీవల 40 ఎఫ్-16వీ విమానాలను సమకూర్చుకోగా.. ఈ సైడ్ విండర్‌లతో ఆ దేశ వాయుసేన మరింత బలోపేతం కానుంది. అయితే, భారత్‌కు వ్యతిరేకంగా ఇటీవల పాకిస్థాన్‌కు డ్రోన్లు, క్షిపణులు అందజేసిన తుర్కియే.. ఈ సైడ్‌విండర్‌లను కూడా పాక్‌కు ఇచ్చే ప్రమాదం ఉంది.

బ్రహ్మోస్ క్షిపణుల కోసం మరో 20 సుఖోయ్ విమానాల అప్‌గ్రేడ్

న్యూఢిల్లీ, మే 17: పాకిస్థాన్, చైనాలకు కంటి మీద నిద్ర లేకుండా చేసేందుకు మోదీ సర్కారు కీలక నిర్ణయం తీసుకున్నది. ఆపరేషన్ సిందూర్‌లో పాక్ వెన్ను విరవడంలో బ్రహ్మోస్ క్షిపణులు కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో బ్రహ్మోస్-ఏ క్షిపణులను మోసుకెళ్లేందుకు వీలుగా మరో 20 సుఖోయ్ యుద్ధ విమానాలను అప్‌గ్రేడ్ చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీంతో బ్రహ్మోస్-ఏ క్షిపణులను మోసుకెళ్లే సామర్థ్యం గల సుఖోయ్ యుద్ధ విమానాల సంఖ్య 60కి చేరుకుంది. ఈ బాధ్యతను హెచ్ఏఎల్‌కి అప్పగించారు. ప్రస్తుతం 2.5-టన్నుల బ్రహ్మోస్-ఏ క్షిపణిని సుఖోయ్ విమానం మోసుకెళ్లగలుగుతుంది. ఇక నుంచి 2.8 టన్నుల బ్రహ్మోస్-ఏ క్షిపణిని 400 కి.మీలకు పైగా దూరంలోని లక్ష్యాన్ని ఢీకొట్టేలా సుఖోయ్ విమానాలను అభివృద్ధి చేస్తారు.

రాష్ట్రపతికి గడువు.. కేంద్రమే పెట్టింది!



2016లో రెండు మెమోలు జారీ చేసిన కేంద్ర హోంశాఖ

- రాష్ట్రాల బిల్లుల మీద 3 నెలల్లోపు ఆమోదం తెలుపాలని రాష్ట్రపతికి సూచన
- ఆ మెమోలనే ప్రస్తావించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మే 17: రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించి పంపిన బిల్లుల మీద గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోపు ఆమోదముద్ర వేయాలని పేర్కొంటూ సుప్రీంకోర్టు తీర్పునివ్వటం మీద రాష్ట్రపతి తాజాగా ఆక్షేపణ తెలిపిన విషయం తెలిసిందే. అయితే, బిల్లుల ఆమోదం గడువు విషయంలో సుప్రీంకోర్టు కొత్తగా ఏమీ చెప్పలేదని, కేంద్రప్రభుత్వం గతంలో స్వయంగా విడుదల చేసిన కొన్ని అధికారిక ఉత్తర్వులనే ప్రస్తావించి, వాటిని అమలు చేయాలని నిర్దేశించిందని తాజాగా వెల్లడైంది. ప్రభుత్వ నిర్ణయాల్లో జాప్యాన్ని నివారించటం కోసం.. బిల్లులను రాష్ట్రపతి మూడు నెలల్లోపు ఆమోదించాలని సూచిస్తూ కేంద్ర హోంశాఖ 2016లో రెండు మెమోలు జారీ చేసింది. తీర్పును వెలువరించిన సందర్భంగా జస్టిస్ జేబీ పార్దీవాలా వీటి గురించి ప్రస్తావిస్తూ.. 'గవర్నర్ సిఫార్సు మేరకు అందిన బిల్లుల మీద మూడు నెలల్లోపు రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర హోంశాఖ పేర్కొన్న గడువు సముచితమైనదేనని భావిస్తున్నాం' అని స్పష్టం చేశారు. ఈ మేరకు 2016 ఫిబ్రవరి 4వ తేదీన కేంద్ర హోంశాఖ జారీ చేసిన తొలి మెమోను సుప్రీంకోర్టు తన తీర్పులో ఉదహరించింది. 'స్పష్టమైన నిబంధనలున్నప్పటికీ, రాష్ట్రాల బిల్లులకు సంబంధించి అనవసర జాప్యం జరుగుతోంది. దీనిని నివారించటానికి, రాష్ట్రాల నుంచి బిల్లు అందిన మూడు నెలల్లోపు తుది నిర్ణయం తీసుకోవాలి. దీనిని కచ్చితంగా పాటించాలి' అని ఈ మెమో స్పష్టంగా పేర్కొనటం గమనార్హం. అంతేకాదు, రాష్ట్రాల నుంచి వచ్చిన బిల్లులలోని అంశాల ఆధారంగా సదరు బిల్లులను సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖలకు పంపటంలో కేంద్రహోంశాఖ మధ్యవర్తిగా వ్యవహరిస్తుందని, బిల్లులోని భాష, పదాల కూర్పు, రాజ్యాంగపరమైన ఆమోదాన్ని కలిగి ఉందా? అన్నవాటిని పరిశీలించటానికి కేంద్ర న్యాయ శాఖకు పంపాలని ఆ మెమో పేర్కొంది. బిల్లును అందుకున్న మంత్రిత్వశాఖ 15 రోజుల్లోపు తన స్పందన హోంశాఖకు తెలియజేయాలని, జాప్యం జరిగితే అందుకు కారణాలు తెలపాలని స్పష్టం చేసింది. నెలలోపు ఎటువంటి స్పందన లేకపోతే, సదరు శాఖకు ఆ బిల్లు మీద అభ్యంతరాలు లేవని భావించాలని తెలిపింది.

నెలలోపు రాష్ట్రాలు వివరణ ఇవ్వాలి

2016 ఫిబ్రవరి 4వ తేదీనే కేంద్రహోంశాఖ జారీ చేసిన రెండో మెమోను కూడా సుప్రీంకోర్టు తన తీర్పులో ఉదహరించింది. బిల్లు మీద సంబంధిత కేంద్ర మంత్రిత్వశాఖకు ఏమైనా అభ్యంతరాలున్నా, మరిన్ని వివరాలు కావాలని భావించినా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు కచ్చితంగా తెలియజేయాలని, రాష్ట్ర ప్రభుత్వాలు నెలలోపు వివరణ ఇవ్వాలని ఈ మెమో పేర్కొంది. నిర్ణయాత్మక ప్రక్రియలో ఉన్న వివిధ భాగస్వాములకు గడువు విధించటం అనేది.. రాజ్యాంగ విధులను నిర్దేశించే ఆర్టికల్ 201కు ఏ రకంగానూ విరుద్ధం కాదని జస్టిస్ పార్దీవాలా స్పష్టం చేశారు. ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి పరిశీలనకు గవర్నర్ పంపిన బిల్లులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని గతంలో వచ్చిన సర్కారియా, పూంచీ కమిషన్లు చేసిన సిఫార్సులకు తగినట్లుగానే 2016లో కేంద్రం జారీ చేసిన మెమోలు ఉన్నాయని నిపుణులు గుర్తు చేస్తున్నారు.

నేడు నింగిలోకి నిఘా నేత్రం



- పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ ద్వారా ఈవోఎస్-09 ఉపగ్రహ ప్రయోగం

సూళ్లూరుపేట, మే 17(ఆంధ్రజ్యోతి): సరిహద్దుల్లో నిరంతర నిఘా కోసం ఉద్దేశించిన ఈవోఎస్-09 (రీశాట్-1బీ) ఉపగ్రహాన్ని పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ నేడు నింగిలోకి మోసుకెళ్లనుంది. తిరుపతి జిల్లాలోని శ్రీహరికోట షార్ అంతరిక్ష కేంద్రం నుంచి ఆదివారం ఉదయం 5.59 గంటలకు ఈ ప్రయోగం జరగనుంది. శనివారం ఉదయం 7.59 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించారు. 22 గంటల పాటు ఈ కౌంట్‌డౌన్ కొనసాగుతుంది. ఒకటో ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ అంతరిక్షంలోకి దూసుకెళ్లనుంది. కాగా, రాకెట్‌లో ద్రవ ఇంధనం, హీలియం, నైట్రోజన్ గ్యాస్‌ను నింపే కార్యక్రమాన్ని శాస్త్రవేత్తలు పూర్తిచేశారు. ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ శుక్రవారం రాత్రి షార్‌కు చేరుకొని ప్రయోగ వేదిక పైనున్న పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్‌ను పరిశీలించారు. రీశాట్-1బీ ఉపగ్రహం బరువు 1,696.24 కిలోలు. దేశ భద్రత, సైనిక అవసరాల కోసం దీన్ని ప్రయోగిస్తున్నారు. భారత్‌కు ఇప్పటికే అంతరిక్షంలో 50కి పైగా ఉపగ్రహాలు ఉన్నాయి. ఈ రాడార్ ఇమేజింగ్ శాటిలైట్ వాటితో జత కలవనుంది. ఇప్పటికే కార్టోశాట్-1 ఉపగ్రహం లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లో తిరుగుతూ చిత్రాలు అందిస్తోంది. అయితే అది రాత్రివేళల్లో ప్రతికూల వాతావరణంలో ఉపయోగపడటం లేదు. తాజాగా పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ ద్వారా ప్రయోగించే ఈవోఎస్-09 ఉపగ్రహంలో అమర్చిన సీ-బ్యాండ్ సింథటిక్స్ ఎపర్చర్ రాడార్ ద్వారా ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా అధిక రెజల్యూషన్‌తో కూడిన భూ ఉపరితల చిత్రాలు లభిస్తాయి.

ఐదేళ్ల దాకా సేవలు

ఈ ఉపగ్రహం ఐదేళ్ల సేవలందించనుంది. పాకిస్థాన్‌తో పాటు చైనా సరిహద్దుల్లోని సున్నిత ప్రదేశాలపై ఈ ఉపగ్రహం కన్ను ఉంటుంది. దేశ సరిహద్దు రక్షణే కాకుండా వ్యవసాయం, అటవీ, భూగర్భం, ప్రకృతి వైపరీత్యాలపై ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తుంది. రీశాట్-1బీ ఉపగ్రహం కక్ష్యలోకి చేరిన 101 నిమిషాల తరువాత తన పని ప్రారంభిస్తుంది.

ముంబైలో ఇద్దరు ఐఎస్ సభ్యుల అరెస్ట్

న్యూఢిల్లీ, మే 17: ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) ఉగ్ర సంస్థకు చెందిన నిద్రాణ దళాల(స్లీపర్ మాడ్యుల్)తో సంబంధం ఉన్న ఇద్దరు వ్యక్తులను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అరెస్ట్ చేసింది. అబ్దుల్లా ఫయాజ్ షేక్ అలియాస్ డైపర్‌వాలా, తల్హా ఖాన్ 2023లో మహారాష్ట్రలోని పుణెలో ఐఈడీ తయారీ, పరీక్షలకు సంబంధించిన కేసులో నిందితులు. రెండేళ్లుగా తప్పించుకు తిరుగుతున్నారు. వీరిపై నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. వీరి సమాచారం ఇచ్చిన వారికి ఎన్ఐఏ రూ.3 లక్షల చొప్పున నగదు బహుమతిని ప్రకటించింది. తాజాగా వీరిద్దరూ ఇండోనేషియా రాజధాని జకర్తాలో తలదాచుకుంటున్నట్లు సమాచారం అందుకున్న ఎన్ఐఏ.. బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ సాయంతో అరెస్టు చేసింది. ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎన్ఐఏ వీరిని అదుపులోకి తీసుకుంది.

జన్యువును మార్చి.. మృత్యువును ఏమార్చి!

- అమెరికాలో 7 నెలల చిన్నారికి అరుదైన 'జన్యు సవరణ' చికిత్స
- భారత సంతతి వైద్యుడు కిరణ్ ముసునూరు కీలకపాత్ర


కిరణ్ అండ్ రెబెక్కా

వాషింగ్టన్, మే 17: అమెరికాలోని పెన్సిల్వేనియాకు చెందిన చిన్నారి కేజే మల్డూన్. పుట్టుకతోనే ఏదో అనారోగ్యం. పరీక్షలు చేసిన వైద్యులు 'సీపీఎస్ 1'గా పిలిచే అరుదైన జన్యులోపంగా గుర్తించారు. సగటున ప్రతి 13 లక్షల మందిలో ఒకరికి మాత్రమే వచ్చే సమస్య. ఇలా పుట్టిన చిన్నారుల్లో చాలా మంది కొన్ని నెలల్లోనే చనిపోతారు. ఒకవేళ బతికినా మానసిక, శారీరక ఎదుగుదల సరిగా ఉండక.. జీవచ్ఛవంలా బతకాల్సిందే. లక్షల మందిలో ఒకరికి వచ్చే సమస్య కాబట్టి.. దీనిపై పెద్ద స్థాయిలో పరిశోధనలు, ఔషధాల తయారీ వంటివేవీ లేవు. కానీ.. అమెరికా వైద్య నిపుణులు అత్యంత అరుదైన జన్యు సమస్యకు.. అంతే వినూత్నమైన 'జన్యు సవరణ (జీన్ ఎడిటింగ్)' చికిత్స చేసి కేజే ప్రాణాలు నిలబెట్టారు. జన్యుమార్పిడి చికిత్సల్లో ఉపయోగించే క్రిస్పర్ విధానం సాయంతో.. ఆ చిన్నారిలోని జన్యువులోని రసాయనాల అమరికలో ఉన్న లోపాన్ని సవరించారు. ఇలా 'ఓ వ్యక్తిలోని జన్యులోపాన్ని వారికే ప్రత్యేకించిన (పర్సనలైజ్డ్/ కస్టమైజ్డ్ జీన్ ఎడిటింగ్ థెరపీ) చికిత్స'తో నయం చేయడం ప్రపంచంలో ఇదే మొదటిసారి.

సరికొత్త విధానంలో రూపొందించి..

కేజే పుట్టిన రెండు వారాలకే అతడి కాలేయ కణాల్లోని ఓ జన్యువులో లోపాన్ని వైద్యులు గుర్తించారు. జీవక్రియల్లో భాగంగా మన శరీరంలో ఉత్పత్తయ్యే అమ్మోనియా, ఇతర విష పదార్థాలను నిర్వీర్యం చేసే ఎంజైమ్‌ను కాలేయం ఉత్పత్తి చేయడానికి ఆ జన్యువే కీలకం. దానిలో లోపం వల్ల ఆ ఎంజైమ్ సరిగా ఉత్పత్తిగాక.. శరీరంలో విష పదార్థాలు పేరుకుపోయి.. మెదడు దెబ్బతింటుంది. కోమాలోకి వెళ్లిపోయి, చనిపోయే ప్రమాదం ఉంటుంది. దీనిపై ఫిలడెల్ఫియా పిల్లల ఆస్పత్రి నిపుణురాలు రెబెక్కా ఆర్లెన్స్ నిక్లాస్, పెన్సిల్వేనియా యూనివర్సిటీ వైద్య నిపుణుడు, భారత సంతతికి చెందిన కిరణ్ ముసునూరు బృందం ఫోకస్ చేసింది. వినూత్నమైన ప్రయోగాత్మక చికిత్స చేసేందుకు కేజే తల్లిదండ్రులు నికోల్, కైల్‌లను ఒప్పించింది. కణాల్లోని జన్యువులను కత్తిరించి.. ఏదైనా భాగాన్ని తొలగించడానికి, అవసరమైతే అతికించడానికి వీలయ్యే 'క్రిస్పర్ కాస్9' విధానాన్ని వినియోగించింది. కేజే కాలేయ కణాలను సేకరించి పరిశోధన చేసింది. అతడి కాలేయ కణాల్లోకి చొచ్చుకెళ్లి.. లోపం ఉన్న జన్యుభాగాన్ని మార్చేలా ఆదేశాలు ఇచ్చే పదార్థాన్ని రూపొందించింది. ఇందుకోసం సుమారు ఆరు నెలల సమయం పట్టింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో కేజే (అప్పటికి ఏడు నెలల వయసు)కు దానితో చికిత్స చేసింది. రెండు నెలల పాటు పూర్తిగా పర్యవేక్షణ చేసి, చికిత్స విజయవంతమైందని తేల్చింది. ఇప్పుడు కేజే పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్టు ప్రకటించింది. జన్యుపరమైన సమస్యలతో బాధపడుతున్నవారికి ప్రత్యేకించిన చికిత్సలు చేసేందుకు ఈ ప్రయోగం మార్గం సుగమం చేసిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం

● విద్యుత్ శాఖ ఏఈ శ్రీను



ఊట్కూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని మండలంలో విద్యుత్ సమస్య రాకుండా ముందు జాగ్రత్త పనులు చేస్తున్నామని విద్యుత్ శాఖ ఏఈ శ్రీను తెలిపారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.

మండలంలో ఎన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లు పని చేస్తున్నాయి?

మండలంలోని ఓబ్లాపూర్, ఊట్కూర్, నిడుగుర్తి, బిజ్వార్ గ్రామాల్లో విద్యుత్ సబ్ స్టేషన్లు ఉన్నాయి. లింగంపల్లి సబ్‌స్టేషన్ నుంచి కొన్ని గ్రామాలకు విద్యుత్ లైన్ ఉంది.

మండలంలో ఎంతమంది ఉచిత విద్యుత్ సౌకర్యం పొందుతున్నారు?

మండలంలో 9 వేల ఇంటి విద్యుత్ మీటర్లు ఉండగా అందులో 7,800 మందికి ఇప్పుడు ఉచిత విద్యుత్ అందుతున్నది.

మండలంలో ఎన్ని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి?

మండలంలో 3 వేల మంది రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. రైతులందరికి ఉచిత కరెంటు అందిస్తున్నాం.

మండలంలో లైన్‌మెన్లు సకాలంలో స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి?

23 గ్రామ పంచాయతీలతో పాటు ఇతర చిన్న గ్రామాలకు కలిపి 12 మంది లైన్‌మెన్లు పని చేస్తున్నారు. ఎక్కడైనా స్పందన రాకుంటే స్వయంగా నాకు ఫోన్ చేసి చెప్పాలి.

గ్రామాల్లో ఓవర్‌లోడ్ సమస్యతో కరెంటు పోతోంది. దీనికి మీరేం చేస్తున్నారు?

విద్యుత్ మీటర్ల ఆధారంగా ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరవుతాయి. కొందరు చట్టబద్ధంగా వాడకపోవడంతో సమస్య వస్తోంది.

పేట యార్డులో ధాన్యం క్రయ విక్రయాలు

నారాయణపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు శనివారం ధాన్యం విక్రయానికి వచ్చింది. ధాన్యం ధరలు ఈ విధంగా ఉన్నాయి.

ధాన్యం	క్వింటాల్	గరిష్ఠ	కనిష్ఠ (రూపాయలలో)
వడ్లు సోనా	967.80	2,071	1,439
వడ్లు హంస	55.80	1,751	1,731
పెసళ్లు	8.33	7,329	6,355
అలసందలు	3.92	5,658	4,255

న్యూస్ బాక్స్

'తిరంగా ర్యాలీని జయప్రదం చేయాలి'

మరికల్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎంపీ డీకే అరుణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించ తలపెట్టిన తిరంగా ర్యాలీని జయప్రదం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు వేణు, ప్రధాన కార్యదర్శి రమేష్ కోరారు. శనివారం మండల కేంద్రంలో వారు విలేకర్లతో మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్‌లో సైనికుల సామర్థ్యాన్ని ప్రశంసిస్తు ఆదివారం పాలమూరు జిల్లా కేంద్రంలో సాయంత్రం 5 గంటలకు స్టేడియం గ్రౌండ్ నుంచి క్లాక్ టవర్ వరకు తిరంగా ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. ర్యాలీకి పార్టీలకతీతంగా నాయకులు, కార్యకర్తలు, యువతీ యువకులు పెద్ద ఎత్తున హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

ఆర్మీకి రైతు బిడ్డ ఎంపిక

మరికల్, మే 17 (ఆంధ్రజ్యోతి): మరికల్ మండలం తీలేరు గ్రామానికి చెందిన రైతు వెంకటేష్, లక్ష్మి దంపతుల కుమారుడు రాజేష్ ముదిరాజ్ ఆర్మీకి ఎంపికయ్యాడు. శనివారం కాంగ్రెస్ పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు కే.ప్రశాంత్‌కుమార్ రెడ్డి రాజేష్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు. అనంతరం పార్టీ మరికల్ మండల అధ్యక్ష పదవికి ఇబ్రహీంపట్నం ఎంపీటీసీ మాజీ సభ్యుడు సీమ గోపాల్ జిల్లా అధ్యక్షుడికి దరఖాస్తు అందించారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు గొల్ల కృష్ణయ్య తదితరులున్నారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడికి ఘన సన్మానం



సత్య ఆంజనేయులును సన్మానిస్తున్న విశ్రాంత పీఈటీ గోపాలం

మక్తల్, మే 17 (ఆంధ్రజ్యోతి): మక్తల్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా ఎంపికైన సత్య ఆంజనేయులును శనివారం సాయిజ్యోతి ఉన్నత పాఠశాల ఆవరణలో షూటింగ్‌బాల్ జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత పీఈటీ బి.గోపాలం ఘనంగా సన్మానించారు. వేసవి క్రీడా శిబిరాన్ని సందర్శించిన సత్య ఆంజనేయులును గోపాలంతో పాటు, రమేష్‌కుమార్, 70 మంది క్రీడాకారులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడాకారులు వెంకటేష్, గౌతమ్, మహేశ్వరి, వెంకటేశ్వరి, సమత, అంజలి, కీర్తి, మీనాక్షి తదితరులున్నారు.

బీటీ రోడ్డుకు మోక్షమెన్నడు?!

» గతుకుల రహదారిపై ఇబ్బందులు పడుతున్న వల్లంపల్లి గ్రామస్థులు



మట్టి రోడ్డును చూపిస్తున్న గ్రామ నాయకుడు గోపాల్‌యాదవ్

ఊట్కూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న వల్లంపల్లి గ్రామానికి బీటీ రోడ్డు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రామానికి రోడ్డు మంజూరై రవాణా కష్టాలు తీరుతాయని ఆశ పడ్డ గ్రామస్థులకు నిరాశే ఎదురైంది. ఎన్నికల సమయంలో నాయకులు వాగ్దానాలు చేయడం తప్పా రోడ్డు మాత్రం నేటికీ మంజూరు కాలేదని గ్రామస్థులు వాపోతున్నారు. వర్షాకాలంలో పేట జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే గుంతలమయంగా, బురదమయమైన రోడ్డుతో తిప్పలు పడుతూ వెళ్లాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గుంతలు పడ్డ రోడ్డుపై నరకయాతన పడుతూ రాకపోకలు కొనసాగిస్తున్నామని వాహనదారులు పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం భారీ వర్షాల కారణంగా గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయని గ్రామస్థులు గుర్తు చేశారు. గ్రామానికి బీటీ రోడ్డు మంజూరైతే తప్పా తమకు రవాణా కష్టాలు తీరేలా లేవని వారు వాపోయారు.

కుంటలు, నాళాల్లో నిర్మాణాలపై అధికారుల తనిఖీ

» నిర్మించుకున్న భవనాలను కూల్చలేమన్న టీపీవో

» రెవెన్యూ, ఇరిగేషన్, మునిసిపల్ కమిటీతో కుంటలను మూయాల్సిందేనని సూచన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కాలువను పరిశీలిస్తున్న ఇరిగేషన్, మునిసిపల్ అధికారులు

కోస్గి, మే 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కుంటలు, నాళాలు ఆక్రమించి నిర్మించుకున్న భవన నిర్మాణాలను శనివారం ఇరిగేషన్ డీఈ ఆనంద్ కిశోర్, ఏఈ నిర్మల, మునిసిపల్ టీపీవో లక్ష్మీపతి తనిఖీ చేశారు. 'నోటీసులిచ్చారు.. చర్యలు మరిచారు' శీర్షికన ఈనెల 15న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తా కథనానికి అధికారులు స్పందించారు. పట్టణంలోని ఎర్రకుంట, లద్దమడుగు, పాతపురికుంటలను అధికారులు పరిశీలించారు. కుంట, కాలువను ఆక్రమించి కట్టిన భవనాలు మేము కూల్చలేమని టీపీవో తెలిపారు. స్పందించిన ఇరిగేషన్ ఏఈ వర్షాకాలంలో కాలనీల్లో నీరు చేరుతుందని, ఇబ్బందులు తప్పవన్నారు. అప్పటికప్పుడు తాత్కాలిక పరిష్కారం చూద్దామని టీపీవో సమాధానమిచ్చారు. మునిసిపల్ టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు తీర్మానం చేసి కాలువలను మూసివేయవచ్చన్నారు. స్పందించిన ఇరిగేషన్ అధికారులు తాము ఒప్పుకోమని.. కాలువలు యదావిధిగా ఉండాల్సిందేనని సూచించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. ఉన్నతాధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి

నారాయణపేట/నారాయణపేట టౌన్/ మక్తల్/ఊట్కూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా వ్యాప్తంగా శనివారం వివిధ సంఘటనల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్ మార్గంలో గుర్మిట్కల్‌కు వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు గుర్మిట్కల్ నుంచి పేటకు వస్తున్న జీపు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో జీపులో ప్రయాణిస్తున్న ఇద్దరు మృతి చెందారు. మక్తల్ పట్టణంలో బైక్‌పై వెళ్తున్న యువతిని వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో ఆమె ఎగిరిపడి కింద పడింది. ఆ వెంటనే లారీ ఆమె తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఊట్కూర్ మండలం కొల్లూర్ గ్రామంలో వ్యవసాయ కూలీ మాల శంకరప్ప(50) పాత గోడను కూల్చేందుకు వెళ్లగా అది కూలి అక్కడికక్కడే మృతి చెందాడు.



కర్ణాటక ఆర్టీసీ బస్సు, జీపు ఢీకొన్న ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (అంతర చిత్రంలో) మృతి చెందిన శిరీష (ఫైల్)

కర్ణాటక ఆర్టీసీ బస్సు, జీపు ఢీకొని..

జీపును కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన నారాయణపేట జిల్లా ఎక్లాస్‌పూర్ గ్రామ సమీపంలోని కర్ణాటక సరిహద్దులో శనివారం చోటు చేసుకున్నది. నారాయణపేట నుంచి కర్ణాటక వైపు వెళుతున్న కర్ణాటక ఆర్టీసి బస్సు గాజల్‌కోట్రికే నుంచి ఆరుగురు ప్రయాణికులతో నారాయణపేట వైపు వస్తున్న జీపును ఎక్లాస్‌పూర్ గ్రామ రోడ్డు మలుపు వద్ద ఢీకొన్నది. దీంతో జీపులో ఉన్న నారాయణపేట జిల్లా కేంద్రంలోని కుమ్మరివాడకు చెందిన శిరీష(10), కర్ణాటక రాష్ట్రంలోని సీపురం గ్రామానికి చెందిన అనంతమ్మ(50) అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ హుసేనప్పను 108 అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. పట్టణానికి చెందిన శిరీష మృతితో బంధువుల రోదనలు మిన్నంటాయి. జీపు డ్రైవర్ చిన్న, మల్లికార్జున్ అందులో ప్రయాణిస్తున్న కుమ్మరి ఉషన్న, కోటగిరి నరసింహ, కోటగిరి శరణమ్మ, కుమ్మరి బాలకృష్ణలకు కూడా తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన కుమ్మరి ఉషన్నను మహబూబ్‌నగర్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఈ విషయంపై నారాయణపేట టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, రేవతి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కర్ణాటక బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొని యువతి..

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి చెందిన సంఘటన మక్తల్ పట్టణంలోని క్రిస్టల్ హోటల్ వద్ద శనివారం రాత్రి 7 గంటలకు చోటు చేసుకుంది. ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మక్తల్ మండలం చిన్న గోప్లాపూర్ గ్రామానికి చెందిన జానకి(32) తన తల్లిగారి గ్రామమైన చందాపూర్ గ్రామానికి తమ్ముడు రమేష్ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా వెనకనుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో ఎగిరి రోడ్డుపై పడింది. ఆ వెంటనే లారీ ఆమె తలపై నుంచి దూసుకుపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. జానకికి 14 ఏళ్లలోపు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఘటనపై మృతురాలి భర్త రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గోడ మీదపడి వ్యక్తి..

పాత ఇంటిని కూల్చడానికి కూలీ పనికి వెళ్లి పని చేస్తుండగానే గోడ మీద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం కొల్లూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, ఊట్కూర్ ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లూర్ గ్రామానికి చెందిన మాల శంకరప్ప(50) గ్రామంలో వ్యవసాయ కూలీ పనితో పాటు గ్రామంలో లభించే ఇతర కూలీ పనులను చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. హైదరాబాద్‌లో ఉంటున్న గ్రామానికి చెందిన మంగలి లక్ష్మమ్మ అనే మహిళ ఇటీవలే గ్రామానికి వచ్చి తన పాత ఇంటిని కూల్చి వాటి స్థానంలో కొత్త ఇంటి నిర్మాణం చేయడానికి పూనుకుంది. దాని కోసం గ్రామానికి చెందిన మేస్త్రీ పసుల గోపాల్‌కు పాత ఇంటిని కూల్చి కొత్త ఇంటి నిర్మాణం చేసి ఇవ్వడానికి ఒప్పందం చేసుకుంది. అనంతరం మేస్త్రీ పసుల గోపాల్ పాత ఇంటిని కూల్చే పనులు ప్రారంభించాడు. శనివారం ఇంటిని కూల్చే పనులకు కూలీకి వెళ్లిన శంకరప్పపై ఒక్కసారిగా గోడ మీద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. ఎస్ఐ కృష్ణంరాజు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట ఆసుపత్రికి తరలించారు. భార్య మాల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణంరాజు తెలిపారు.

జూన్ 6 నుంచి 19 వరకు బడిబాట

నారాయణపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): రానున్న 2025-26 విద్యా సంవత్సరానికిగాను ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని జూన్ 6 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించాలని నిర్ణయించింది. తెలంగాణ సర్వశిక్షా అభియాన్ స్కూల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర డైరెక్టర్ నర్సింహరెడ్డి ప్రొసీడింగ్ నెంబర్ 1442/ఎస్ఎస్/టి4/2020 ఉత్తర్వులు శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి అందాయి. నారాయణపేట జిల్లాలో 508 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 2,290 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. బడిబాటలో భాగంగా జూన్ 6న గ్రామసభ నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏడో తేదీన ప్రతీ ఇంటిని సందర్శించి బడీడు పిల్లలను గుర్తించాలి, 8 నుంచి 10వ తేదీ వరకు ఇంటింటి ప్రచారం, అంగన్‌వాడీల సందర్శన, డ్రాపౌట్ పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడంతో పాటు, ప్రత్యేక అవసరాలు ఉన్న భవిత కేంద్రాల్లో చేర్పించాలి. 11న కార్యక్రమాల సమీక్ష, 12న అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రజా ప్రతినిధులతో ప్రారంభించేలా చర్యలు తీసుకొని విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందించాలి, 13న సామూహిక అక్షరాభ్యాసం బాలసభ, 16న ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ దినోత్సవం, 17న విలీన విద్య, బాలిక విద్యా దినోత్సవం నిర్వహించాలి, 18న తరగతి గదుల డిజిటలీకరణపై అవగాహన, మొక్కల పెంపకం ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించాలి, 19న బడిబాట ముగింపు సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రచార పోస్టర్ ఆవిష్కరణ

మద్దూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): మద్దూర్ డిగ్రీ కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం మద్దూర్‌లో ప్రచార పోస్టర్‌ను ఆయన సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దూర్‌లో ఏర్పాటు చేసిన కళాశాల మొదటి సంవత్సరంలోనే ఉత్తమ ఫలితాలు సాధించిందన్నారు. డిగ్రీ మొదటి సంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్నాయని, దోస్త్ మొదటి విడుతలో మే 21 నాటికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులో మొదటి ప్రాధాన్యత మద్దూర్ కళాశాలను(3113) ఎంచుకోవాలని పరిసర మండలాల పరిధిలోని గ్రామాల విద్యార్థులకు ఆయన సూచించారు.

దురలవాట్లకు యువత దూరంగా ఉండాలి

మరికల్, మే 17 (ఆంధ్రజ్యోతి): యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటేనే భవిష్యత్ ఉన్నతంగా ఉంటుందని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మే 31 ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని యువతకు, విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి దశలో తెలిసో, తెలియకో పొగాకు ఉత్పత్తులకు ఆకర్షితులై జీవితాంతం సిగరెట్, బీడీ, గుట్కాలకు బానిసలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్నేహితుల వల్ల వారి సాయం వల్ల జీవితంలో గొప్పగొప్ప ఆలోచనలకు బీజం పడాలే తప్ప వ్యసనాలకు బానిసలు కావొద్దన్నారు. ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని మా స్నేహితుడు మంచి స్థితిలో ఉన్నాడని గర్వపడేలా జీవితాలను తీర్చిదిద్దుకోవాలని యువతకు దిశా నిర్దేశం చేశారు.

రికార్డులను అప్‌డేట్ చేయాలి: ఏపీవో



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఏపీవో సత్యప్రకాష్

మక్తల్‌రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఏపీవో సత్యప్రకాష్ తెలిపారు. మక్తల్ మండలం భూత్పూర్, రుద్రసముద్రం గ్రామ పంచాయతీలోని ఉపాధి హామీ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీ రిజిస్టర్లను తనిఖీ చేశారు. రికార్డుల్లో ఏఏ విత్తనాలు పెట్టారు, ఏ మొక్కలు ఎంత ఎత్తులో పెరుగుతున్నాయి, మొక్కల ఎదుగుదలకు ఏమైనా సమస్యలుంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు.

గన్నీ బ్యాగులు అందించి, లారీలను పంపిస్తాం

» అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్



నేరడగమ్ములో రైతులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్

మాగనూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు పంపే విధంగా ప్రతీ సెంటర్‌కు గన్నీ బ్యాగులు, లారీలను రైతులకు అందుబాటులో ఉండేటట్లు చూస్తానని అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఆయన మండలంలోని నేరడగమ్ము గ్రామంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. గన్నీ బ్యాగుల గురించి, లారీల గురించి విండో కార్యాలయానికి వెళితే అక్కడున్న అధికారులు సరైన సమాధానం చెప్పకుండా ఇప్పుడు పంపిస్తాం, రేపు పంపిస్తామని చెబుతూ కాలయాపన చేస్తున్నారని రైతులు అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే మిల్లులకు ట్రాక్టర్లలో ధాన్యం తరలించామని, ట్రాక్టర్ల కిరాయి డబ్బులు ఇవ్వాలని రైతులు కోరగా ఆయన సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విండో అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ సురేష్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, ఎంపీడీవో రహమతుద్దీన్, ఎంపీవో విజయలక్ష్మి, మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్, వివిధ శాఖల అధికారులు, రైతులు ఉన్నారు.

లక్ష్యాన్ని ఏర్పరచుకొని క్రీడల్లో రాణించాలి

» మునిసిపల్ కమిషనర్ భోగేశ్వర్లు

» వేసవి అథ్లెటిక్ శిక్షణ శిబిరాల పరిశీలన



క్రీడాకారులతో మునిసిపల్ కమిషనర్ భోగేశ్వర్లు

నారాయణపేట న్యూటౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు ఓ లక్ష్యాన్ని ఏర్పరచుకొని క్రీడల్లో రాణించాలని మునిసిపల్ కమిషనర్ భోగేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో కొనసాగుతున్న వేసవి అథ్లెటిక్ శిక్షణ శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖేలో ఇండియా అథ్లెటిక్ కోచ్‌ను హారికదేవిని క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అదేవిధంగా మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వేసవి క్రికెట్ శిబిరాన్ని కమిషనర్ పరిశీలించి, మాట్లాడారు. నెల రోజుల పాటు జరిగే ఉచిత క్రికెట్ కోచింగ్ శిబిరాన్ని వినియోగించుకోవాలని, ప్రతీ క్రీడాకారుడు రాణించి జిల్లా పేరును నిలబెట్టాలన్నారు. ఈనెల 20న అండర్-19, క్రికెట్ నారాయణపేట జిల్లా జట్టు గద్వాల జట్టుతో తలపడనుందని జనరల్ సెక్రటరీ రమణ తెలిపారు కార్యక్రమంలో క్రికెట్ కోచ్ అజయ్‌కుమార్, చెన్నారెడ్డి, సురేందర్‌రెడ్డి, రమేష్ తదితరులున్నారు.

గోవులను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు

» సీఐ శివశంకర్



పేట పీఎస్‌లో వధశాలకు చెందిన ఆర్గనైజర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శివశంకర్

నారాయణపేట/కోస్గి రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): గోవులను అక్రమంగా రవాణా చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని పేట సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం నారాయణపేట పోలీస్‌స్టేషన్‌లో రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకొని వధశాలకు చెందిన ఆర్గనైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ముస్లింలు బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. బక్రీద్ పండుగ రోజు గొర్రెలను కోసేవారు వాటి చెత్తను, కళేబరాలను పరిసరాలకు దూరంగా పారేయాలన్నారు. అలాగే ఆవులు, దూడలను వధించొద్దన్నారు. వధశాలలో జంతువులను వధించాలంటే వెటర్నరీ డాక్టర్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, లేకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రైనీ ఎస్ఐ రేవతి ఉన్నారు.

అదేవిధంగా, కోస్గి పోలీస్‌స్టేషన్‌లో సీఐ సైదులు శాంతి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవులను, చిన్న ఎద్దులను వధించొద్దని సూచించారు. చట్టానికి లోబడి ఉండాలని, శాంతి భద్రతలను కాపాడడంలో పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో ఎస్ఐ బాల్‌రాజ్, హిందూ, ముస్లింలు పాల్గొన్నారు.

'నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి'



పిడెంపల్లి గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

దామరగిద్ద, మే 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కూలీలకు 365 రోజులు ఉపాధి పనులు కల్పించాలని, రైతు పండించిన ప్రతీ పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఐక్య రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నారెడ్డి డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో వామపక్ష పార్టీలు చేపట్టిన గ్రామీణ భారత్‌బంద్ కార్యక్రమంలో భాగంగా శనివారం దామరగిద్ద మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి, కరపత్రాలను పంచారు. రైతులను, కార్మికులను కలిసి ఈనెల 20న చేపట్టనున్న బంద్‌లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పెద్దింటి తాయప్ప, వెంకటయ్య, రైతులు, కార్మికులు పాల్గొన్నారు.

'ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలి'

ఊట్కూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలందరికి 200 రోజులు పని కల్పించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కనకరాయుడు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఎడవెల్లి, చిన్నపొర్ల గ్రామాల్లో సార్వత్రిక సమ్మెకు సంబంధించిన కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు, కూలీలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20న నిర్వహించ తలపెట్టిన సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకుడు చిన్నబాలు తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణంతో తీరిన కల



గుండుమాల్ నుంచి అప్పాయపల్లి వరకు కొత్తగా వేసిన బీటీ రోడ్డు

కోస్గి రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): తమ చిరకాల వాంఛ అయిన బీటీ రోడ్డు నిర్మాణంతో కల నెరవేరిందని తండావాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శనివారం గుండుమాల్ మండల కేంద్రం నుంచి అప్పాయపల్లి తండా వరకు దాదాపు 5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చారు. తాము ఎన్నో ఏళ్ల నుంచి గుంతల రోడ్డుతో అష్టకష్టాలు పడ్డామని, చివరకు కాంగ్రెస్ ప్రభుత్వం తమ రవాణా కష్టాలను తీర్చిందని వారు సంతోషం వ్యక్తం చేశారు. తండాకు బీటీ రోడ్డు వేసి మా కల నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటామని, సహకరించిన కాంగ్రెస్ మండల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తండావాసులు బాబ్యానాయక్, సురేష్‌నాయక్, రమేష్ నాయక్ తదితరులున్నారు.